

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

– పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**ఆమె పలక్కపోవటం** చూచి ఊర్మిళ మరలా అంది. "మరి నేనో?" ఊర్మిళ విభ్రాంతిగా అడిగింది.

ఆమె ఊర్మిళ వైపు చూచింది. బలిష్టమైన వృక్షానికి పెనవేసుకుపోయి చిలువలు పలువలుగా అల్లుకు పోయిన లత హఠాత్తుగా పెనుగాలికి వృక్షం కూకటి వేళ్ళతో కూడా పెకలింప బడగా... బలవంతంగా విడదీయబడి చిందర వందరగా నేల మీద ఉండలు చుట్టుకు పడిపోయినట్లు ఊర్మిళ కంపించి పోతోంది. లక్ష్మణుడు అతని అనురాగం తప్ప.... మరో ప్రపంచం తెలియని ఈ ఊర్మిళ, భర్త వైపు బంధువులెవరితోనూ యెక్కువగా  చనువుగానీ కలిసి పోయే స్వభావం గానీ లేని బిడియస్తురాలైన ఈ ఊర్మిళ... రాత్రింబవళ్ళు తన పెంపుడు చిలుక నోటి వెంట కూడా "లక్ష్మణ స్వామీ" అని పలికించి మురిసిపోయే ఊర్మిళ.... పధ్నాలుగేళ్ళు... ఒకటి కాదు రెండు కాదు... పధ్నాలుగేళ్ళు లక్ష్మణుడిని వదిలి... ఈ అంతఃపురంలో.

"నేనూ వెళతాను అరణ్యాలకు." ఉత్తేజంగా ముందు అడుగు వేస్తూ అంది ఊర్మిళ.

గబుక్కున ఆమె భుజం పట్టుకు ఆపింది ఆమె.

“లేదు తల్లీ. వెళ్ళవు వెళ్ళలేవు. వెళ్లేందుకు వీలుపడదు. నువీ అంతఃపురంలోనే ఉంటావు. నీకు తోడుగా నేనుంటాను.” ఆమె తనని తాను సంబాళించుకుంటూ అంది. ముందున్నది మృత్యువని తెలిసి కూడా తన విధి తాను నిర్వర్తించే యోధ సైనికుని గొంతుకలా ఖంగుమంది ఆమె కంఠస్వరం.

“అంతఃపురంలోనా? యీ అంతఃపురంలో ఇక నాకేం మిగిలి వుందని వుండటం? నా స్వామి వెంట అరణ్యంలో ఉండటంలోనే నాకు ఆనందం వుంది. నేనూ వెళతాను. సీతక్కలా నా భర్త వెంట ఛాయలా నేనూ వుంటాను. భర్తను అనుసరించి అరణ్యాలకు వెళ్ళిందన్న సత్కీర్తి నేనూ తెచ్చుకుంటాను. నా స్వామిలేని ఈ అంతఃపుర భోగాలు నాకూ అవసరం లేదు. ఈ శూన్య మందిరంలో నేనుండలేను. పూర్ణిమా! వెళ్ళు త్వరగా. లక్ష్మణ స్వామిని వెంట పిల్చుకురా. వారి వెంట నేనూ వచ్చేందుకు వారిని వేడుకుంటాను. ఒప్పిస్తాను.” పిచ్చిదానిలా ఏడుస్తూ అంది ఊర్మిళ. పూర్మిమ కదల్లేదు. శిలలా బిగుసుకు పోయి నిల్చుండి పోయింది. రాచనగరులో రాచరికాలలో కర్తవ్యాలు అతి కఠోరమైనవని యీ పిచ్చితల్లికి తెలియజేయటం ఎలా? కర్తవ్యాల కఠోరత ముందు, కర్తవ్యాల ప్రాధాన్యత ముందు అనురాగాలూ, అయినవారూ అన్నీ తృణప్రాయమని యీ చిట్టితల్లికి నచ్చ చెప్పటం ఎలా?

“వెళ్ళు పూర్ణిమా! వెళ్లి లక్ష్మణస్వామిని పిల్చుకురా.” పిచ్చిదానిలా అరిచింది ఊర్మిళ. పూర్ణిమ యిలా ఎందుకు రాయిలా నిల్చుని వుందో ఆమెకు బోధపడలేదు.

“ఇప్పుడు నేను వెళ్ళకూడదమ్మా. ఇది ప్రణయ సన్నివేశం కాదు. దాసిగా, దూతికగా నేను నీ స్వామికి నీ సందేశాన్ని అందించటానికి. ఇది ప్రళయం! ప్రళయ ఝంఝూ మారుతం. నేను వెళ్ళినా సాక్షాత్తూ ఆ దేవుడే వెళ్ళినా లక్ష్మణస్వామి కన్నెత్తి పలుకరించరు. ప్రళయకాల రుద్రునిలా వున్న ఆయన నిర్ణయం మార్చుకోరు. నిన్ను వెంట పిల్చుకు వెళ్లరు. నీవు అంతఃపురంలో వుండే నిర్ణయం జరిగి పోయింది. వారిప్పుడు ప్రయాణ సన్నాహంలో వున్నారు” అంది ఆమె. శిల పలుకుతున్నట్లుంది ఆమె గొంతుక, అనుభూతుల కతీతంగా.

“వెళ్ళే ముందు యీ జరిగినదేమిటో ఇక జరగబోయే దేమిటో నాతో ఒక్క మాట చెప్పరా? ఒక్కసారి నాకు కనిపించి, నామొరాలకించి...” ఊర్మిళ కంఠం పూడుకు పోతోంది.

“లేదు తల్లీ! ఈ సమయంలో అనుభూతులకూ, అనురాగాలకూ అతీతుడు నీ భర్త. ఈ బంధానికి... ఆలోచనకూ మొగ్గు చూపడు. నీ అంతఃపురానికి వచ్చే సమయం లేదుట. నిన్ను అనునయించే అవకాశం లేదు. ఈ పద్మాలుగేళ్ళు ... నువ్వు అంతఃపురంలోనే వుండాలి.”

మరుక్షణం ఊర్మిళ స్పృహ తప్పి అచేతనంగా పడి పోయింది స్పృహ తప్పిపోయిన ఊర్మిళ పక్కన కూర్చుని పూర్ణిమ ఆమెకి శైత్యోపచారాలు చేయలేదు. చేయదల్చుకోలేదు. ఊర్మిళ ఎదుర్కొంటున్న ఈ మానసిక పరిస్థితిలో ఆమెకి అచేతన స్థితే హాయి ఐనది! ఈ చైతన్యరాహిత్యంలోనే ఈమె ఈ పదునాలుగేళ్ళ దీర్ఘ కాలాన్ని గడపాలి. చైతన్య వంతంగా వుండే హృదయం ప్రతి చిన్న స్పందనకీ స్పందించి కలవరపడుతుంది. చైతన్యరాహిత్యంలో మనసు మొద్దుబారి పోతుంది.

ఊర్మిళ, లక్ష్మణుల పెంపుడు చిలుక పంజరంలో నుంచి ముద్దుగా పలుకుతోంది. "లక్ష్మణా లక్ష్మణా" అంటూ.

స్పృహ కోల్పోయిన స్థితిలో కూడా ఊర్మిళకా పిలుపు సుదూర తీరాలనుంచి వినిపిస్తోంది అస్పష్టంగా.

"లక్ష్మణా!" అవును ఆ మూడు అక్షరాలలోనే తన తనువూ, బ్రతుకూ ఐక్యం అయిపోయాయి. చిలుకల చేత మాటలు పలికించడంలో అత్యంత నేర్పరి లక్ష్మణుడు. అతగాడే ఈ చిలుకకు మాటలు నేర్పాడు.

"పూర్ణిమా!" పిలువబోయింది ఊర్మిళ. ఆమెకి మగతగా వుంది. మనసు మొద్దుబారి పోయినట్లుంది. పిలవలేక పోయింది. ఆమె పెదవుల కదలికను బట్టి తెలుసుకుంది పూర్ణిమ.

"నేనిక్కడే వున్నాను ఊర్మిళా! నేను నీడలా వుంటాను. నీ భర్తనూ... నీ భర్త సాన్నిధ్యాన్ని నేను నీకు ఇవ్వలేను. కానీ... కానీ.. నీ ఈ చైతన్యరహిత స్థితిని.... నీ భర్త వచ్చే క్షణం వరకూ నీ ఉండేలా చూస్తాను. నువ్వెప్పుడో అప్రయత్నంగా కళ్ళు తెరుస్తావు! చిరునవ్వు నవ్వుతావు లేదా, దుఃఖిస్తావు. కానీ నీ మనసు సక్రమంగా పని చేస్తూ, చేసే క్రియలు కావాలి. కేవలం యాదృచ్ఛికంగా జరిగే పనులు అవయవాల కదలికలు! నీలో ప్రాణం వున్నందుకు కొన్ని గుర్తులు మాత్రమే! నీకు తెలుసు కదా. నేను అతి సమర్ధురాలైన వైద్యురాలిని. ఈ నీ చైతన్యరాహిత్య స్థితిలో నీ శరీరమూ, ఆరోగ్యమూ తగ్గకుండా కాపాడుకుంటాను. నీ యవ్వనమూ, ఆరోగ్యమూ శిధిలం కాకుండా జాగ్రత్తలు వహిస్తాను,

లక్ష్మణస్వామి వచ్చిన మరుక్షణం, నీకీ చైతన్యరాహిత్య స్థితి వదిలి పోతుంది. భర్త పిలుపు లోని మాధుర్యం, నీ శిలాసదృశ హృదయాన్ని తట్టి మేల్కొలుపుతుంది. నాకు తెలుసు తల్లీ! నీ భర్త లేని ఈ అంతఃపురం నీకు శూన్య గృహం. అరణ్యం కంటే భయంకరమైనది. నరకం కంటే దుర్భరమైనది. కానీ నీకిక్కడ ఉండక తప్పని పరిస్థితి! భర్తృ వియోగం కలిగేసరికి, ఆ దుస్సహ వేదనతో నీ మెదడు మొద్దుబారి పోయిందొక్క సారిగా!

నీ మామగారైన దశరథ మహారాజు చేత, నిర్లక్ష్యం చేయబడిన స్త్రీ... నీ అత్తగారు సుమిత్ర. ఆమెకు కౌసల్యలా పట్టమహిషి హోదా లేదు. కైకేయిలా చిన్నరాణి చనువూ లేదు. సుమిత్ర మౌనంగా, అటు కౌసల్యాదేవి కనుసన్నలలోనూ , ఇటు కైకేయి ఆగ్రహానుగ్రహాలలోనూ, కేవలం ప్రాణం వున్నా శిల్పంలా జీవితం గడిపింది. దివ్య పాయసమూ సుమిత్రకి సగౌరవంగా పంచబడలేదు! దశరథ మహారాజు పాయస పాత్రలోని పాయసాన్ని కౌసల్యనూ కైకేయినీ సమభాగాలుగా

తీసుకోమని చెప్పాడు. ఆయన దృష్టిలో సుమిత్ర లేదో, వున్నా పట్టమహిషికీ, ముద్దుల భార్యకూ కోపం వస్తుందన్న శంకతో అలా చెప్పాడో, ఏమో తెలీదు. కౌసల్య, కైకేయిలు కేవలం జాలితో మాత్రమే సుమిత్రకు తమ వాటాలలోని పాయసాన్ని భిక్షలా దానం చేసారు. బహుశా ఆ సమయంలోనూ ఆమె మనసూ మెదడూ కూడా నీకిప్పుడు సంభవించిన నరకం చైతన్యరాహిత్య స్థితికి చేరుకొని ఉండవచ్చు. తనకు ఇవ్వబడిన వస్తువును మౌనంగా స్వీకరించటం మాత్రమే ఆమె అలవర్చుకుంది. తనకు ఫలానాది కావాలని ఏదైనా కోరే మనః స్థితినీ, కోర్కెలనీ ఆమె ఏనాడో మర్చిపోయింది. సమాధి చేసింది. అలాటి మౌన, గంభీర, నిరాడంబర, నిర్వేద, నిర్వికార, నిరహంకారమూర్తి గర్భంలో ఊపిరి పోసుకుని జన్మించాడు నీ భర్త లక్ష్మణస్వామి! తల్లి అణచుకున్న ఉద్రేకానికీ, తల్లి మ్రింగిన అవమానాలకీ, జ్వలించే ప్రతీకారాలకీ, పరాక్రమానికీ ప్రతిబింబం ఈ నీ భర్త. అయితే అసూయ అన్నది తల్లిలోనే లేదు కాబట్టి నీ భర్త అసూయలకి అతీతుడు.

పట్టమహిషి కౌసల్య కుమారుడు శ్రీరామచంద్రుడు, రాజ్యార్హత కలిగిన బిడ్డ! నీ భర్త లక్ష్మణుడు అన్నగారిని మనసా, వాచా, కర్మణా అనుసరించి సేవించవలసిన వ్యక్తి. ఇది రాజకీయం. రాజరికాల సాంప్రదాయం. రాజ్యార్హత కల్గిన మహారాజు, రాజ్యంలో వున్నా, అరణ్యాలకు వెళ్ళినా, ఆయనను అనుసరించి తీరాలి నీ భర్త. అది పద్ధతి. కాబోయే రాజు భార్య అయిన సీత... రాజు వెంట అరణ్యాలకు వెళ్ళవచ్చు తప్పులేదు. కానీ సేవించవలసిన పరాక్రమ వంతుడైన యుద్ధ వీరుని వెంట.... (అవును ఊర్మిళా! ఇది నిజమమ్మా) అతని భార్య వెళ్ళటం ... ఆ వీరుని కర్తవ్యపాలనకు అంతరాయమే కానీ కర్తవ్యపాలనకు దోహదకారి కాదు. ఆ కారణంగానూ నువ్వు అంతఃపురంలోనే వుండి తీరాలి!

నిర్లక్ష్యం చేయబడిన ఓ మహారాణి కోడలివి నువ్వు. బహుశా ఆగమ చరిత్రలో నిర్లక్ష్యం చేయబడే పాత్రవు నువ్వు. భర్త వెంట అరణ్యాలకు వెళ్ళి చరిత్రలో యుగాయుగాలు కీర్తింపబడుతుంది సీత.

నీ పేరు చరిత్రలో మరిచి పోనివ్వను నా చిట్టి తల్లీ!

“భర్త అరణ్యాలకు వెళ్ళాక ఊర్మిళ అంతఃపురంలో భోగాలు అనుభవిస్తోందా? ముగ్గురత్తగార్లకూ సేవలు చేస్తూ వుండి పోయిందా? భర్త తప్ప మరో ధ్యానం లేదని అంతఃపురమంతా వింతగా గొప్పగా చెప్పుకొనే ఊర్మిళ ఆ భర్త తిరిగి వచ్చే క్షణం వరకూ ఏం చేసింది? ఎలా ప్రవర్తించింది? ఇష్టసఖులతో ఆటపాట వ్యాపకాలు కల్పించుకుని తనని తాను మర్చిపోవటానికి ప్రయత్నించిందా?” అలాంటి ప్రశ్నలకు ఆస్కారం కలిగించను.

పధ్నాలుగేళ్ళు ఏడుస్తూ కూర్చోవడానికి కన్నీళ్లు ఉండవు.

ఊర్మిళా! నిద్రలోకి జారిపోయావా! దీర్ఘనిద్ర కోరుకుంటున్నావా? దీర్ఘనిద్ర అంటే మృత్యువు కదా! భర్తృ పరిత్యక్తలాటి స్థితి నీది. మృత్యు సమానమైన జీవితంగా మారిపోయిందీ క్షణంలో. చైతన్యాన్ని కోల్పోయిన నీవు... ఈ

చైతన్యరాహిత్య స్థితినే కొనసాగించు. అందుకు దోహదం చేస్తాను. అలా నీలోని పొంగులు పొరుతున్న యవ్వనాన్ని, అనురాగాన్ని, ఆరాటాన్ని, ఆవేదననీ అన్నిటినీ అడ్డుకట్ట వేస్తాను. పధ్నాలుగేళ్ళ అనంతరం నీ భర్త అయోధ్యకు తిరిగి వచ్చిన మరుక్షణం నీలో తిరిగి చైతన్యం మేలుకొంటుంది. అప్పుడే నిద్ర లేచిన దానిలా నీవాతనికి స్వాగతం పలుకుతావు. ఊర్మిళ నిద్రే ఊర్మిళని చరిత్రలో ఓ మర్చిపోలేని పాత్రగా నిలపవచ్చు. నీ ఉనికి నీ నిద్రలోనే వుందమ్మా. ఇదిగో ఈ కొద్ది పానీయం తీసుకో. ఇలా నా వడిలో పడుకో. నిన్ను కన్నబిడ్డలా శయనాగారానికి చేరుస్తాను. కంటికి రెప్పలా కాపాడుకుంటాను." కన్నీళ్ళ తెరల మధ్య పూర్ణిమ... స్త్రీలలో అరుదుగా వుండే ఆజానుబాహు శరీరం గల పూర్ణిమ అవలీలగా ఊర్మిళను రెండు చేతులతో ఎత్తి స్పృహ తప్పిన స్థితిలోనే ఆమెను శయనాగారం చేర్చింది.)

"ఎలా వుంది మొదలు?"

అహల్య ప్రశ్నతో చదువుతున్న కాగితాలలోనుంచి కళ్ళెత్తాడు డాక్టర్ రామచంద్రం. అందాకా ఓ అద్భుత దృశ్య కావ్యంలో మునిగి తేలుతున్న అనుభూతి పొందుతున్న అతగాడు త్రుళ్ళి పడ్డాడు కూడా. అహల్య అలా పలకరించకుండా వున్నా బావుండేదనిపించింది.

"ఎలా వుంది రామం?" మళ్ళీ ఆదుర్దాగా అడిగింది అహల్య. అతగాడలా తనకేసి విభ్రాంతిగా చూస్తుంటే తను వ్రాసినదంతా నచ్చలేదోమోనన్న అనుమానం వచ్చిందామెకు.

"ఎలా వుందని చెప్పను? మాటల కందడం లేదు. సూపర్బ్ అంటే సరిపోతుందా? అద్భుతం అంటే నప్పుతుందా? అంత చక్కగా వుంది" అన్నాడు రామచంద్రం కళ్ళద్దాలు తీసి కర్చీఫ్ తో తుడుస్తూ.

అహల్యకు చాలా ఆనందం కలిగింది. ఆ ఆనందం తాలూకు మెరుపామె కళ్ళలో ప్రతిఫలించింది. క్షణకాలం ఆ చక్కటి కళ్ళు తళ తళ లాడాయి.

"ఇలాగే కంటిన్యూ చేయమంటావా రామం. నవలకి పురాణ పాత్రలలో 'పూర్ణిమ' పాత్ర లేదు. నేనే సృష్టించాను. అది పురాణాలని కింద పరచటంగా విమర్శకులు భావిస్తారా?" అంది.

"పురాణ పాత్రలలో లేని పాత్రల్ని సృష్టించినా తప్పు లేదు. కానీ, మనం పాత్ర స్వభావ స్వరూపాల్ని పిచ్చిగా మార్చి, వాళ్లకి లేని గుణాల్ని, అవగుణాల్ని ఆపాదించకుండా వుంటే చాలు. పురాణాల పట్ల మన కృతజ్ఞత వెల్లడించుకున్నట్లే అవుతుంది. నీ ఊర్మిళ పాత్ర చదువుతుంటే పక్కన పూర్ణిమ పాత్ర తప్పనిసరి అనిపిస్తోంది. ఎంచేతో మా ఊర్మిళ గుర్తుకొస్తోంది నాకీ రోజు పదే పదే!"

"మీ ఊర్మిళా?" ఆశ్చర్యంగా అడిగింది అహల్య.

"అవును. మా ఊర్మిళే!"

"ఆవిడ నీకేమౌతుంది?" కుతూహలంగా అడిగింది అహల్య.

ఆమె కళ్ళలో కనిపించిన కుతూహలం ఆరాటం చూస్తుంటే నవ్వొచ్చింది రామచంద్రానికి. ఆడవాళ్ళకి సహజంగా అతి ఊహ చేసే స్వభావం వుంటుంది. అవతలి ఆడమనిషి పేరు మగాడి నోటెంట వినగానే, ఆ స్త్రీ పురుషుల మధ్య గల సంబంధం ఏమిటన్న ప్రశ్నా, కుతూహలం వాళ్ళలో ముందుగా తలెత్తుతాయి. అహల్యకూడా అంతే!

"ఏమీ కాదు." రామచంద్రం నవ్వుతూ అన్నాడు.

"ఏమీ కాదా?"

"ఊహుఁ! మా ఊర్మిళ అంతే! ఆమె పరిచయం ఎప్పుడో చేస్తాలే నీకు. ముందీ నవల పూర్తి చెయ్యి. నా ఫ్రెండు పత్రిక నడుతున్నాడు. మొదటి సంచిక నుంచీ నీ నవలే ప్రారంబించేలా చెబుతాను" అన్నాడు లేచి నిల్చుంటూ.

"అప్పుడే వెళుతున్నావేమిటి రామం. మరో ఘట్టం వరకూ చదివి వెళ్ళవూ?" అంది అహల్య కాస్త నిరాశగా.

"ఇంకా నయం. రఫ్ కాపీ పూర్తిగా చదివి వెళ్ళమనలేదు. నా సుమతి నర్సింగ్ హోం లోని పేషంట్స్ మాటేమిటి? మీ ఇంటి దగ్గరే ఓ ఖరీదైన పేషంటు దొరికాడు నాకు. లక్షాధికారి. జబ్బు ఆట్టే లేదుగానీ, జబ్బును గురించి భయంతో హై బి.పి. హడావుడి ఎక్కువగా వుంది. నర్సింగ్ హోంలో చేరమంటే ససేమిరా అన్నాడు. నన్ను ఇంటి దగ్గర కొచ్చి చూచి వెళుతుండమన్నాడు. బంగారు పిచ్చుక లాటి పేషంటుని వదులుకోవటం తెలివి గల డాక్టర్లు చేసే పనికాదు. అంచేత ఈ రోజు నుంచీ రోజూ ఉదయం ఓ గంట సాయంత్రం ఓ గంట ఇలా వచ్చి ఆయనగార్ని చూసి వెళ్తూ వీలయితే నీతో కాసేపు మాట్లాడి వెళదామనుకున్నాను. నువ్వు నవల ముందేశావు. నీలో ఇంత భావుకత, రచనా శక్తి వుందని నాకిందాకా తెలీదు. నీవు ప్రయత్నిస్తే అద్భుతమైన రచనల్ని పాఠకులకు అందించగలవనిపిస్తోంది. వెళ్ళొస్తా!"

డాక్టర్ రామచంద్రం ఇక జవాబు ఆశించకుండా రోడ్డు మీదకు వెళ్ళిపోయాడు. విజయవాడ లాటి సిటీలో టౌన్ లో రెండు రూములు గల ఈ పోర్షన్ వీధి వైపు వుంటుంది. మిగతా ఇంటితో ఏలాటి సంబంధమూ వుండదు. అద్దె వందరూపాయలు. సపరేట్ బాత్ రూమ్, లావెటరీ వున్నాయి పెరట్లో. ఈ గదులకు సంబంధించిన పెరడూ ప్రత్యేకంగానే వుంటుంది. ఇంటి ఓనరు తనకోసం కేటాయించుకున్న రూములట ఇవి. అయితే ఆయన ఈ రెండంతస్తుల మేడా బాడుగకు ఇచ్చేసి, వ్యాపారరీత్యా బొంబాయిలో స్థిరపడ్డాడు. అంచేతే అహల్యకీ రూములు అద్దెకు దొరికాయి.

రామచంద్రం డాక్టర్. ఇప్పుడిప్పుడే కాస్తంత పలుకుబడి సంపాదించుకుంటున్నాడు టౌన్ లో. కారులో కూర్చుని రామచంద్రం వెళ్ళిన వైపే వో నిమిషం పాటు చూస్తూ నిల్చుండి పోయింది అహల్య. ఆమె హృదయం ఆర్ధ్రమయింది. అతగాడి పట్ల ప్రేమ పొంగులు వారింది. తనెవరు? తనెక్కడ పుట్టింది? పెరిగింది... ఎందుకీ విజయవాడ వచ్చింది? విజయవాడ రాక ముందు తనెక్కడ వుండేది? ఎలా వుండేది? ఏ పరిస్థితులిలా తరిమాయి?

రాయిలా మారి శిలలా ఘనీభవించి ఈ రూంలో తనని తాను మర్చిపోవాలనే ప్రయత్నంలో రామచంద్రమే లేక పోయి వుంటే తనీసరికి ఏమై పోయి వుండేది?

అహల్య కెందుకో ఈ పూట గతమంతా గుర్తుకు వస్తోంది. వద్దన్నా గుర్తుకు వస్తోంది. వాకిలి గది తలుపు వేసి, చాప పరుచుకుని పడుకుంది. ఇంట్లో సామాన్లు ఏమీ లేవు. పది పన్నెండు సత్తు పాత్రలున్నాయి. అన్నం వండుకుందికీ, నీళ్ళు నిలవ చేసుకుందికీ... రామచంద్రమే కొనిచ్చాడు అవి. ఓ చాప, దిండు, రెండు బెడ్ షీట్స్ వున్నాయి. ఓ స్టౌ, ఓ చిన్న లాంతరు. విజయవాడలో ప్రతి రెండు గంటలకీ కరెంటు పోతుంది.

చాప మీద పడుకుని, కళ్ళకి మోచేయి అడ్డు పెట్టుకుని పడుకుంది అహల్య. కానీ ఆ మూసుకున్న కళ్ళ లోపల్నుంచి అంతరాంతరాలలో గతం దృశ్యాలుగా కనిపిస్తోంది. మనోనేత్రాలు చూస్తున్నాయా దృశ్యాలని.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments